* జాహ్నవి *

'శండిల'

"జాహ్నవీ! జాహ్నవీ?"

"వస్తున్నా నాన్నా ఏం?"-పన్నెండేళ్ళమ్మాయి పరికిణీకుచ్చెళ్ళు చేతబట్టుకుని చెంగున వడవలోకివచ్చి ఆనందబాబువంక ప్రశ్నార్థకంగా చూసింది చిరునవ్వు మొగంతో. "ఉత్తరాలొచ్చినట్లున్నాయ్. పుచ్చుకోవమ్మా" అంటూండగానే రెండంగలలో వాకిట్లోకి వెళ్ళి పోస్టుజవానిచ్చిన మూడుకవర్లూ పుచ్చుకుని వచ్చీరాని ఇంగ్లీషుతో చిరునామాలు చదవడానికి ప్రయత్నిస్తూ "నాన్నా కిశోర్ బాబు గారికి మళ్ళీ మూడుకవర్లు" అని తండ్రి చేతి కందించింది. జాలిని ప్రకటించే ముఖంతో కవర్లు తడిమి మూడూనూ బుక్ పోస్టులే అని గుర్తించి "అతని రచనలు, పత్రికలు తిరిగి త్రిప్పేశాయి." "ఏమిటి నాన్నా" తండ్రికళ్ళలోకి చూస్తూ అడిగింది జాహ్నవి. "ఏమీ లేదమ్మా మనింట్లోకి అద్దెకొచ్చినప్పటినుండి చూస్తున్నా. కిశోర్ బాబు రాత్రింబవళ్ళు ఏక వ్రాస్తూనే వున్నాడు. రచన లెన్నిసార్లు పంపాడో పత్రికలకు—అయితే ఒక్కటీ ప్రచురింపబడ్డట్లు తోచదు." "మనం రోజూ చదివే పత్రికలకేనా? మరి వాళ్ళో వేసుకోరేం?"—అడుగుతున్న జాహ్నవితో "ఆయన వ్రాయడం వరకేనమ్మా అవి సంపాదకులకు నచ్చాలి. లేకపోతే ప్రచురించుకోరు." ఆనందబాబు ఇలా అంటూండగానే కాలేజీ నుండి యింటికివచ్చే కిశోర్ ఆయన చేతులోని కవర్లు అందుకుని "మళ్ళీ తిరిగొచ్చాయి" అని "ఏగతి రచియించెనేని సమకాలికు లెవ్వరు మెచ్చరేగదా" అనుకుంటూ గదితాళంతీసి మేజాక్రిందున్న దేవదారు చెక్కతో పెట్టెలో గిరవాటేశాడు. అప్పటికే గుట్టలుగావున్న రచనలు తమకో ముగ్గురు నూతన మిత్రులు చేరారన్న సంతోషంతో పకిలించినట్లు కొద్దిపాటి సవ్వడి చేశాయి.

కాలేజీచదువుతోబాటే అంకురారోపణ జరిగింది కిశోర్ బాబు రచనావ్యవసాయానికి. నాలుగేళ్ల జీవితంలోనూ ఎన్నో కృతులు చేశాడు. కనీసం కొన్నివందలైనా పత్రికలకు పంపి వుంటాడు. బహు కొద్దిమాత్రమే ప్రచురితములయ్యాయి. రచనద్వారా సమాజంలో సంస్కారం తీసుకురావాలన్న మహత్త్వాకాంక్ష వెలుగొందింది ఆతనిలో. కళారాధన క్రమేపీ అతన్ని ఇతరఆశయాలపట్ల వేవిధాల విముఖుని చేసింది. తనకు తెలీకుండగానే తోటివారిలో ఒక విచిత్రవ్యక్తిగా మారిపోయాడు. విద్యార్థులూ, అధ్యాపకులూ కిశోర్‌లో విచిత్రమైన ఉన్మత్తతను చూసి విస్తుపోసాగారు. తన భావాలను లోకం ఎందుకు పరిగణించదో! అనే సంఘర్షణ పొడుకొంది.

పరీక్షలైనాక ఇంటికివచ్చిన తమ్ముని చూసి అన్న రవీంద్రుడు చాలా ఆశ్చర్యం పొందాడు. అతనిలోని విపరీతపరిణామానికిగల కారణాలు గుచ్చిగుచ్చి అడిగాడు. తల్లీదండ్రీ లేని తమ కుటుంబంలో తమ్ముని భారం తనమీద తనకు తానుగా విరుచుకుపడింది. అప్పూ సప్పూ జేసి ఏనెల కానెల యాభైరూపాయలు పట్నం పంపుతూండేవాడు చదువుకి. క్రిందటిసారి తాను కిశోర్‌ను చూడబోయినప్పుడు ఆనందబాబు తరచు ఇంటి అద్దెగూడా పుచ్చుకోకుండా తమ్ముని ఆదరించుతున్నట్లు తెలిసింది. ఇన్నిహంగులుండీగూడా తమ్ముడు బొత్తిగా సంరక్షణ లేని కిరాయి మనిషినిగా మారిపోవడంలో గల ఆంతర్యం అన్నకు బోధపడలేదు. "అబ్బే—ఏమీ లేదు—నాకేం—నిక్షేపంగా వుంటే" అని ముక్తసరిగా సమాధానమిస్తాడు కిశోర్. పోనీ ఏ ప్రేమ జాడ్యమేనా సోకిందా అనుకుంటే అదీ వున్నట్లు తోచదు. ఆనందబాబు అనేకసార్లు తనకు లేఖలు వ్రాస్తూ తమ్ముని సౌశీల్యాన్ని వేనోళ్ళ కొనియాడాడు.

రవీంద్రుని జిజ్ఞాస అధికమైంది. రాత్రింబవళ్లు తదేకదీక్షగా పుస్తకాలు చదవడం, తీరికవున్నపుడల్లా తెగ వ్రాస్తూవుండడం—కిశోర్ చివరకు ప్రపంచాన్నే మఱచిపోతున్నట్లు గుర్తించాడు. సౌభ్రాతృత్వాన్ని పురస్కరించుకుని చూచాయగా మందలించాడు. కిశోర్ పెడచెవిని బెట్టాడు. తుదకు ఆతనికి స్వగ్రామంలో వుండడం దుర్ఘటమయ్యింది.

ఒకనాడు అన్నగారితో చెప్పకుండా బిచానా సర్దుకుని పట్నం చేరుకున్నాడు. తనలో బయలుదేరిన తుఫానుకు అనువైన వాతావరణంకొఱకు ప్రాకులాడ్డం మొదలుపెట్టాడు.

ఆనందబాబుయింటిలో తన గదిలోవున్న రచనలను మళ్ళీ తిరగేశాడు. జాగ్రత్తగా పరిశీలించి బూజూ, దుమ్మూ దులిపేశాడు. ఏదైనా ఉద్యోగం దొరికేదాకా తమతోనే వుండమనీ, జాహ్నవికి చదువు చెప్పమనీ బ్రతిమాలాడు ఆనందబాబు. ఆయనకోరికపై కొంతకాలంవరకైనా అక్కడవుండక తప్పిందిగాదు. రోజుకు వొక్కగంట మాత్రమే చదువు చెప్పేవాడు. కిశోర్‌కు వుండే తీరికగల సమయం అదొక్కటే. ఆనందదాయకమూ, ఆహ్లాదకరమూ అయినకాలం ఆ పట్నవాసజీవితంలో యేదైనావుంటే ఆక్షణమే. అమాయికతనూ, నిర్మలత్వాన్నీ విరియబోసే జాహ్నవీముఖకవళికలే అతన్ని బాహ్యప్రపంచంనుండి మళ్ళించేవి. ఆమెయెడల జాలీ, ఆప్యాయతా, వాత్సల్యమూ కిశోర్‌బాబులో సుడులు తిరిగేవి.

మిగతా వేళల్లో ఒకటే సంఘర్షణ వందలాది పత్రికాధిపతులతో వాగ్వివాదాలు. రచయితలతో చర్చలు. గ్రంథాలతో భావసంవాదాలు. ప్రకృతిని పరిశీలించడం. ఇవి లేనిసమయంలో విధివిరామం లేకుండా చేత కలం బట్టుకుని కాగితాలను పరంపరలుగా నలుపుచేయడం. ఇవే అతని దైనికచర్యలు. సమాజం వింటూందా లేదా? లోకం ఆదరించదెందుచేత? అనే శంకలులేకుండా అతని హృదయసీమలోంచి, మేధాప్రపంచంనుండి విచిత్ర మానవప్రవృత్తులు, వింతప్రకృతి, వివిధసమస్యలు,—కథలుగా, నాటికలుగా, గేయాలుగా, నవలలుగా, వర్ణచిత్రాలుగా వెలువడి శాశ్వతంగా వ్రాతప్రతులలో ఇరుక్కుపోయాయి. స్వేచ్ఛకై నిరీక్షించే జన్మఖైదీలవలె ప్రకటితం గాకుండా బంధింపబడ్డట్లు పడివున్నాయి. అయినా అతనిలో నిరుత్సాహం అవుపించదు. ఏండ్లు గడచినా కిశోర్‌కు నిశ్చయం చలించలేదు. తనచుట్టూ ప్రపంచం తన్నుజూచి నవ్వుతూన్నా, హేళనచేస్తూన్నా, ప్రతిఘటిస్తూన్నా అతడు వొక్కడుగైనా కదలడంలేదు.

కొన్నాళ్ళకు దైనందినజీవితం గడచేవిధం కష్టమైంది. విసిగి విసిగి అన్నగారు డబ్బు పంపడం మానుకున్నాడు. పట్నంలో కానీ రాబడిలేదు. కాగా కాగితాలకూ, సిరాకూ ఖర్చు తగ్గలేదు. అప్పు పెట్టి తనను కొన్నాళ్లు ఆదుకున్నాడు ఆనందబాబు. తుదకు అదిగూడా మందగించింది. పరిస్థితులొక్కమారుగా ఆలోచనలోనికి దింపినట్లుయింది. ఏమూలచూసినా దైన్యమూ, నైరాశ్యమూ తాండవిస్తున్నాయి.

ఒకనాటి సంఘటన కిశోర్‌బాబును కలచివేసింది. రెండురోజులుగా ఇల్లువిడిచి అప్పుడే తిరిగివచ్చాడు. ఆనందబాబు పడకగదిలో కొంత అలజడిగావుంది. ఆయన్ను ఇద్దరు వైద్యులు పరీక్షిస్తున్నారు. "మనోవ్యాధి" అన్నాడొకాయన. "హృద్రోగం" అన్నాడింకొక డాకరు. రాత్రి పదిగంటలవరకూ వేచియుండి ప్రాణంమీద ఆశలేదని పెదవులు విరచుకుని వెళ్ళిపోయారు. ఒకప్రక్క కిశోర్—మరొకవంక జీవితంలో ఒడుదుడుకు లెరుగని లేబ్రాయపు జాహ్నవి—ఆనంద్‌బాబును కనిపెట్టుకుని కావలి కాస్తున్నారు. బాహ్యప్రపంచమంతా కటికచీకటి కౌగిలింతలో గాఢంగా నిద్రపోతూంది. పన్నెండుగంటలకు బరువుగా నిట్టూర్చి కనులు విప్పాడు ఆనందబాబు. మంచినీటికై పెదిమలు మెదిపాడు. జాహ్నవి కంటినీరు తుడుచుకుంటూ లోనికి వెళ్లింది కిశోర్‌బాబు చేతిని బట్టుకుని ఆనందబాబు కళ్లనంబడి నీళ్లు జలజల రాలుస్తూ చెప్పడం ప్రారంభించాడు. "కిశోర్! ఇక పరిస్థితిని గూర్చి నీకు చెప్పనక్కరలేదు. నీలో చెలరేగిన సంఘర్షణ నేను ఏనాడో గుర్తించాను. విపత్కరవిషమ వాతావరణంలో నీవు ప్రయాణం చేస్తున్నావు. అంతిమవిజయం నీదే. అయితే—నా తుదికోర్కెవొక్కటుంది.. చెల్లించవూ?" అంటూంటే జాహ్నవి మంచినీటిని తెచ్చి తండ్రి కంఠం తడిపింది. కిశోర్ ధైర్యంతో గుండె చిక్కబట్టుకుని "బాబూజీ! ఎందుకు సందేహిస్తారు చెప్పండి. మీరు నాకుచేసిన మేలు వేయి జన్మలకైనా మఱువలేను. తప్పక మీ ఆజ్ఞ శిరసావహిస్తాను." అన్న వెంటనే "నాకున్న కాంక్ష ఒక్కటే. లోకం ఏమనుకున్నా సరే—నీవేమి నిశ్చయించుకున్నా సరే—ఒక దీనురాల్ని—రెక్కలురాని పసికందును,—అనాధను నీ చేతబెట్టివెడుతున్నా. దీన్ని పెంచి, పెద్దదాన్ని జేసి, రక్షించి, పాలించే భారం నీది. నేటినుంచీ ఈ ఇల్లు నీది. ఇదొక్కటే జాహ్నవికున్న దిక్కు—పైన నీయిష్టం" అన్నాడు. "దానికి మీరు బెంగపెట్టుకోకండి. అవశ్యం ఈమెను రక్షించేభారం నాది. ఇదిగో వాగ్దానం. ఎంత కష్టమైనాసరే దీన్ని నిర్వహిస్తాను" అని కిశోర్ ఆనందబాబుచేతిలో తన చేతినుంచాడు. జీవితంలో తుదిసారిగా ఆనందబాష్పాలను గ్రుమ్మరించి దుఃఖాశ్రువులతో తనకు

వీడ్కోలిచ్చే జాహ్నవిని చూస్తూ శాశ్వతంగా కన్నుమూశాడు ఆనందబాబు.

2

జాహ్నవిని వృద్ధికి తెచ్చే భారం కిశోర్ మీద పడింది. ఇంటిలో రెండు గదులు మినహా మిగిలిన భాగమంతా నలభై రూపాయల కద్దికిచ్చేశారు. అదే వారికి జీవనోపాధి. నౌకరీ చేద్దామంటే స్వాభిమానం చంపుకు తింటూంది. రోజూ రెండు గంటలసేపు ఆమెకు చదువుచెప్పడం; మిగతా సమయంలో రచన, పరిశీలన, ఆలోచన—ఇవీ ఆయన నిత్యకృత్యాలు.

కాలగర్భంలో నెలలు క్రమంగా వత్సరాలుగా మళ్లుతున్నాయి. జాహ్నవిలో నూతన వసంతంవలె నవ్యయౌవనశోభ చిగురుస్తూంది. వయసు గడచిన కొద్దీ ఆమెకు విద్యయందు వాంఛ మెండయ్యింది. రాత్రనకా పగలనకా కిశోర్ బాబును వేధించుకు తింటూంది పాఠాలు చెప్పమని. అప్పటప్పట ఆమెను కసురుతూ చేతి వాడితనంగూడా చూపేవాడు. కాని ఆమెను తాకినపుడల్లా అతనిలో వివిధ ఆలోచనలు స్ఫురించేవి. తన కథలలో, నవలల్లో ప్రత్యక్షంగానో పరోక్షంగానో జాహ్నవి నృత్యం చేసూంది. పదహారేళ్లు దాటాయి ఆ కన్యకు. ప్రపంచాన్ని క్రమంగా దూరం చేసుకుంటూన్న కిశోర్ కు జాహ్నవి మాత్రం దగ్గరగా వస్తూన్నట్లు తోచింది. నిరంతరం జాగ్రదవస్థలోనే వుండడానికి ప్రయత్నించేవాడు. జాహ్నవివల్ల అతడు తలపెట్టిన సంఘర్షణ, రచనాకృషి కుంటుపడడం మొదలైంది. మానవ సహజమైన భావోద్రేకం అతన్ని మైకంలో ముంచి తేల్చేది. ఎంతో బాధపెట్టింది. తన నిశ్చయం దృఢమైంది. దానికై తానెట్టి త్యాగానికైనా సిద్ధమై వున్నాడు.

నాటిరాత్రి రెండు గంటలదాకా పట్నంలో పర్యటించి కిశోర్ బాబు బడలికతో ఇల్లు చేరుకున్నాడు. త్రిప్పటలో మునిగి భోజనమాటే మఱచిపోయాడు. ఆయాసంతో మెల్లెక్కుతున్నాడు. ఇంతరాత్రైనా లోన సద్దుమణగలేదు. జాహ్నవి కంఠం స్ఫుటంగా వినబడుతూంది. "ఈ ప్రపంచాన్ని విడిచి వెడుతూ నాన్నగారు నన్నాయనకు వప్పగించారు. నాటినుండి ఆయనే కంటికి రెప్పగా కాపాడుతున్నారు." "అయితే - జాహ్నవీ! నీకు పెండ్లీడు వచ్చిందిగదా—ఆయనేమీ ప్రయత్నాలు చేస్తూన్నట్లు కనుపడదేం" ఇది ఇంటిలో అద్దెకున్న విమలాదేవిగారి కంఠం. అరుగుమీద గోడవారనే చదికిలబడి తనను యోచనావాహినిలోకి దిగలాగే ఈ సంభాషణ వింటూన్నాడు.

"ఏమో! ఆయనకు మాత్రం తెలీదూ"

"పోనీ—ఏకాకిగదా. జాహ్నవీ. నిన్నెందుకు ఆయన వివాహం చేసుకోగూడదూ. మహా వుంటే కిశోర్ బాబుకు ముప్పైకంటె ఎక్కువుండవు. యువకుడులానే వుంటాడూ. ఈడు తక్కువేమీ వుండదు"

"అమ్మో—ఆ ప్రసక్తి తేవడానికి నాకు గుండె చాలదు. ఆయన కేమి తోస్తుందో అంతే. నే నేపాటి దాన్ని యీ విషయం బాబు ఎదుట తలపెట్టడానికి? కొంచెం కళ్లెఱ్ఱజేశారా వొళ్ళు దడదడ వణుకుతుంది నాకు."

"ప్రపంచం మిమ్ముగురించి ఎంతో విడ్డూరంగా తలుస్తూంది. సహజంగూడా. యౌవ్వనంలోవున్న యువతీయువకులు ఒకేఒకచోట కొన్నియేండ్లుగా జీవించడం—కొంచెమైనా ఇతరులలో వైపరీత్యానికి తావివ్వదూ?" "కిశోర్ బాబు నాకు దైవసమానుడు. క్షమామూర్తి. దయామయుడు. ఆయన నిశ్చయాలు అచంచలాలు. ఆయన రచనలు చదువుతూంటే ప్రపంచాన్ని ఊపగల ప్రచండమారుతం ఆయనలో చెలరేగుతున్నట్లు తేటపడుతుంది" "నీమాట కడ్డొచ్చాను. అయితే ఏ పత్రికలలోనూ ప్రకటించుకోరేం? పోనీ పుస్తకాలుగానైనా వెలువరించరేం?"

"దానికనేక కారణాలుండొచ్చు. ఆయన సాగిస్తూన్న మానసంగ్రామమే యిది. ఇతరులకు నచ్చనంత మాత్రాన మనభావాలను చంపుకోవడం పిరికితనం. చరిత్రలో ఎన్నో ఉదాహరణలున్నాయి జీవించియుండగా యిట్టి మహామేధావుల్ని సన్మానించి తరింపలేకపోయామే అని సమాజాలు కుమిలికుమిలి యేడ్చినయుగాలు" "జాహ్నవీ!" బలహీనంగా పిలిచాడు. సంభాషణ స్తంభించిపోయింది. తలుపులు తెరువబడ్డాయి. కిశోర్ భారంతో గదిలోకి వెళ్ళి ప్రక్క దులుపుకుని దీపం సన్నంచేసి మేను వాలుస్తున్నాడు. "బాబూజీ! భోంచెయ్యరూ?" జాహ్నవి భుక్తిమాటను జ్ఞప్తికి తెచ్చింది. "అక్కర్లేదు. పడుకో. ఇంతసేపటిదాకా మేలుకుని వున్నావేం?" "అబ్బే! ఇప్పటిదాకా చదువుకుంటూనే వున్నాను. మధ్యాహ్నం మీరు వెళ్ళిపోయిన తర్వాత మీరు పంపిన సీరియల్ తిరిగివస్తే మీకోసం ఎదురుతెన్నులు కాసి ఏమీతోచక తీరిగ్గా తిరగేస్తున్నాను. పోనీ అన్నం తినకపోతే కాసిన్నిపాలూ, రొట్టే తీసుకోండి" అని ఆమె తనగదివైపు వెళ్ళింది.

కిశోర్ మళ్ళీ ఆలోచనలోకి దిగాడు. ఆమె ఎంతో అమాయకురాలు. తనకు తెలీకుండా వెర్రిగా ప్రేమను పెనవేసుకుంటూన్న లేదీగె. ఆమె దగ్గరగా రావడం సుతరామూ తనకు గిట్టదు. ఆనంద్ బాబుకు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి తన వ్యక్తిత్వాన్ని అమ్మేసుకుంటున్నాడు. ఇప్పటి వాతావరణం తన ఆశయాలను తనకు తెలీకుండా చాటుచేస్తూంది. ప్రస్తుతం తాను ఆమెకు దూరంగా వుండకపోతే తన దృష్టి వామముఖంపట్టి జీవితంలో గెలుపును చూడలేడు.

పాలగ్లాసూ, రొట్టెలపళ్ళెంతోనూ ప్రత్యక్షమైంది జాహ్నవి. మంచంపై పడుకునే రొట్టెముక్క విరుచుకుని కాగినపాలలో ముంచుకు తింటున్నాడు. దీపపుకాంతిలో ఆమెముఖంవంక తేరిపారజూచాడు. నిర్మలమైన కాంతితో పున్నమినాటి నడిరేయిని ప్రశాంతంగా ప్రవహిస్తూన్న పవిత్రజాహ్నవిని గుర్తుకుతెస్తూంది.

"నాకథ ఎలాగుందీ" ముడిగా ప్రశ్నించాడు. "మీకథ బావుండకపోవడం వేమిటీ? అందులో— నాకు?" చిరునవ్వుతో ఆమె సమాధాన మిచ్చింది. సరోవరంలో పండువెన్నెలలో వెలిగే కలువరేకులు కదిలినట్లు మెదులుతాయి కనురెప్పలు. తాను ఓడిపోతున్నాడు ఆ కదలికకు. "ప్రపంచం నా కృషిని ప్రశంసింపకపోవడం నీకు బాధగావుంది గాదూ?" "అలా గంటారేం? ఎవరికైనా బాధగా ఉంటుంది ఉత్తమకృషి నిర్లక్ష్యం చెయ్యబడ్డప్పుడు. మీకు మాత్రం విచారం కలుగదూ?" "లేదు - జాహ్నవీ లేదు. పొరబడుతున్నావు. సమాజం నన్ను సవాలు చేస్తూంది. నేను ధైర్యంతో దాన్నెదుర్కొంటున్నాను. దీనిలో ఖేదానికి తావేలేదు. ఉండగూడదు. ఎదుటనుండి వచ్చే తాకిడిని ఎదుర్కొన్నవాణ్ణే విజయలక్ష్మి వరిస్తుంది." "ఏమిటో— మీరూ మీ ఊహలే వేరు. మీ పరిధిలో యోచించడానికి ఏపాటిదాన్ని?" "రోజు రోజుకూ మారే ప్రపంచాన్ని చూస్తూంటే ప్రపంచంతోబాటు మారే నీకు నీలో వింతలేమీ పొడగట్టడం లేదూ?" "నా కర్థంగావడం లేదు మీ ధోరణి" అంటూ ముసిముసి నవ్వులతో జాహ్నవి తన గదిలోకి పోయింది.

ఆ మలుపులో, చిరునగవులో, వడిలో, నాటి రాత్రి ఆమె వైఖరిలోనే ఏదో ఒడుపుండి కిశోర్‌ను బలంగా బంధించి ఎక్కడకో ఈడుస్తున్నట్లు పసిగట్టాడు. ఆ క్షణంలో రెండేదారులు అతని ఎదుట అవుపిస్తున్నాయి. ఒకటి ఏకాంత జీవితం; అనవరత తీవ్రసంఘర్షణ! సంతోషంతో హాలాహలాన్ని మ్రింగి అమృతంకొఱకు అంతిమ విజయంకోసం జీవితమందరాన్ని ప్రపంచ సాగరంలో మథించడం— రెండవది సుఖమయమైన, ప్రశాంతమైన, సుసంఘటితమైన, భోగలాలసమైన, దీక్షారహితమైన వీడ్కోలు ఆ పోరాటానికి. "నీకే జయం అని బిడియం లేకుండా సమాజానికి సాగిలబడి తన ఓటమిని స్వయంగా స్వీకరించడం"— తలంచుకునేసరికి ఒళ్లు కంపించింది జగత్తు తన్ను పరిహసిస్తూంది. కలం గడగడలాడుతూంది. మూలనున్న పెట్టెలోని అముద్రిత గ్రంథాలు— ఏళ్లుగా కుప్పలు కుప్పలై బంధింపబడ్డ ఖైదీలు స్వేచ్ఛావాయువులకొఱకు అంగలార్చుతూ తననే ఆధారంగా ఆశాజ్యోతిలా భావించుకుని యున్నట్లు కనుపించే తన కృతులు— కిశోర్ బాబు నిశ్చయించాలి. ఊహాసంఘర్షణ నింక సాగనివ్వగూడదు. అటో ఇటో తేల్చెయ్యాలి.

కిటికీలోంచి బాహ్యప్రకృతి చీకటిలో జీబురుగా తొంగిచూస్తూంది. గడియారం నాలుగు కొట్టింది. గతకాలం తన మనస్సులో తికమకలతో నెమరు వేయబడుతూంది. సాహసించి లేచాడు— అటు ఆ గదివైపు చూచాడు. గంభీరంగా ఆజవరాలు ఒడలు మఱచి నిద్రపోతూంది. అరణ్యమధ్యంలో ప్రియుని నెడబాసిన దమయంతి: రాహులుడు చెంతలేని, గౌతముడు వీడిన యశోధర— లిప్తకాలంలో విరసంగా అతని భావనలో మెదిలారు. దృష్టిని ఇటు మరల్చాడు. ఆవాళే తిరిగివచ్చిన "పెద్దకథ"— జాహ్నవిలో తనపట్ల దైవత్వాన్ని పాదుకొల్పిన రచన— లోకం నా కక్కర్లేదని పారవేసిన కృతి; సమాజం తన్ను ఎదురుదెబ్బ దీసిన సవాలు;— అతనికి తెలీకుండానే చేతులు త్వరత్వరగా పనిచేస్తున్నాయి. కాళ్ళు తడబడ్డాయి. కవర్లు, కాగితాలు, రచనలు, పుస్తకాలు— ఒండొరులను కౌగిలించుకుని ఉక్కిరిబిక్కిరిగా త్రొక్కిసలాడాయి. దీపంలో చమురు తగ్గివట్లుంది. కాంతి క్రమంగా తగ్గిపోతూంది చీకటిలో గూడా. ఆ ఘడియలో నెత్తిమీద ఎత్తుకొనబడ్డ పెద్ద పెట్టెతో, పరులకు చోరుడా అని స్ఫురింపజేసే ఒక వ్యక్తి జాలిగా తనను విడువలేక వీడ్కొలిచ్చే ముగ్ధ కన్యకతో మూగపడుమలా వున్న ఆనందబాబు ఇంటినుండి వెలికిబడి ప్రత్యూషంలోకి జరిగిపోతూన్న చీకటిలో నెమ్మదిగా సాగిపోయాడు.

3

గ్రామసీమ కలకలలాడుతూంది. గోపాల్ బాబు చిన్ననాటి స్నేహితుడు కిశోర్ బాబు వచ్చిన కొలది రోజులకే ప్రారంభోత్సవం జరుపబడింది "కుటీర ప్రచురణల"కు. ఊళ్ళో వున్న గృహస్థులంతా అల్పాహార విందు ఆరగించి వెళ్లారు. రాత్రి అతిథుల్ని సాగనంపి మిత్రు లిద్దరూ భావి కార్యక్రమం గూర్చి చర్చించారు. కిశోర్ బాబు ప్రతిభ చిగుర్చుకుంటున్నప్పటినుండి గోపాల్ బాబుకు పరిచయమే. కాలమాన పరిస్థితులనుబట్టి నడిచే ప్రవృత్తి ఆయనది.

"కిశోర్! నీ రచనలు బాగానే వున్నాయి. కానీ ఒక పేరువడ్డ రచయితనుబట్టి పీఠిక వ్రాయించాలి. వ్రాసినవాడు వ్రాయకుండా గ్రంథానికో పెద్దని యెన్నుకోవాలి." "లేకుంటే మనం బ్రతుకలేమా? స్వతంత్రంగా మన శక్తిని మనం చాటుకోలేమా?" "అది గాదోయ్. నేటి ప్రపంచానికి కొంతైనా డాబికం చూపాలి. లేనిదే ముందు అది మనకు లొంగదు" "ఒకడిదగ్గరికి మనం పుస్తకాన్ని దీసికెడితే మన కెన్ని పేర్లు పెడతాడూ—రచయితలంతా యాచకులవంటివాళ్లే. "యాచకో యాచకశ్శత్రుః." "నీవు అలాగంటే లాభంలేదు." (ఈ రోజుల్లో ఎలాంటివాడైనా సరే డబ్బుకి గడ్డి తింటాడు")—కిశోర్ బాబు ఆలోచించాడు. తన కిష్టం లేకపోయినా ఈ యెత్తు మొదట్లో కొంత ఆకర్షవతంగా అవుపడింది. "అయితే — మనదగ్గర డబ్బేదీ" "ఆఁ—అలా దారిలోకి రా. నా కొక వాగ్దానం యిస్తే చాలు. నువ్వు "ఊఁ" అంటే సరి - తర్వాత పని గానిస్తా." వాగ్దానం అనేసరికి కిశోర్ బాబుకు ఆనందబాబు అంతిమఘట్టం గురుకువచ్చింది. గోపాల్ బాబు చిన్నప్పటినుండి తనతో యెరమరిక లేకుండా తిరిగినవాడే - ఎటొచ్చీ యీ నాలుగైదేళ్ళనుండీ తనకు కనబడలేదు. "ఊఁ" అనొచ్చు కానీ—ఇత నెలాంటి కోరిక కోరుతాడో! ఏ కోరికయితేనేం—ముందు నా సంఘర్షణలో జయించే ఆశ మెరుస్తూంది. "ఓ—అలాగే కానియ్. కాని ఒకటి జాగ్రత్తగా విను. నేను తలపెట్టిన ఉద్యమంలో కృతకృత్యుణ్ణి అయినతర్వాతనే నీమాట చెల్లిస్తా"—"సరేలే—ఇప్పుడే మునిగిపోయిందేమీ లేదు. మన పాచిక పారి సమాజం లొంగి వచ్చినపుడే నువ్వు చేయొచ్చు నే జెప్పినపని" "గోపాల్—నీ ఉద్దేశ్యం నాకు బోధపడలేదు. సమాజం అంటే అనపగుగ్గిళ్ళనుకున్నావా—లోకం మొండి, బండ, గ్రుడ్డి, మూగ, చెవుడు, ఫెంకి—ఇన్ని విశేషణాలుగల పదార్థం. దీనికి రూపురేఖలు, పలుకుతీరులు, సకల కళలు తెచ్చిపెట్టేసరికి మనవంటివాళ్లు కనీసం కొన్ని వందలమంది యువకుల ప్రాణాలను బలిపెట్టాలి." "కళాకారుడ వనిపించుకున్నావులే"

మరునాడుదయాననే ప్రారంభించి ఎకాయెకీని నెలరోజులలో వొక నవల వ్రాశాడు కిశోర్. "జాహ్నవి" అని పేరుపెట్టాడు. సాక్షాత్తు తన రక్తంతో వ్రాసినంత కృషిసల్పాడు. పుస్తకం చేతబట్టుకుని ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా ఎందరో గ్రంథకర్తలను సందర్శించాడు గోపాల్. అంతక్రితమే నాలుగువేలు పెట్టికొన్న ప్రెస్ మేనేజిమెంటు కిశోర్ కు వప్పగించాడు. చూచిన రచయితల్లా కళ్ళుకుట్టింది "జాహ్నవి". తమను కాదని తమ ఆధిపత్యాన్ని కొలదన్నే రచయిత తారాపథానికెగ్రాకుతున్నాడు. ఈర్ష్య, సంకుచితత్వం, స్వార్థం,—వాళ్ళను గ్రుడివాళ్ళను చేశాయి. తాము సహకరించకపోయినా రచయిత నిరాటంకంగా పైకి వచ్చేస్తాడు. అయినా మానవనైజము మానుకోలేరు. పెదవి విరిచాను. నిరశించారు కొందరు. విమర్శించారు. ఖండించారు. రచనంటే ఏఁవిటో యెఱుగని గోపాల్ బాబు బిక్కమొగంపెట్టాడు. కిశోర్ కు మాత్రం ఏమీ దిగులుగలుగలేదు. ఎవరంగీకరించినా మానినా తానుమాత్రం దాన్ని అచ్చొత్తించి ప్రకటించడానికే నిశ్చయించుకున్నాడు. కాని గోపాల్ బాబు వొప్పుకోలేదు. తొలుదొలు తనే తనకు పెట్టుబడి పెడుతున్న మిత్రునితో ఘర్షణపడడానికి మనస్కరించలేదు. "జాహ్నవి" తాను ఇన్నాళ్లుగా ఆదరించి, ఆలోచించి—తీర్చి దిద్దిన కళాఖండం పాతరచనల బుట్టలో కుక్కబడింది. తర్వాత చాలా గ్రంథాలువ్రాశాడు. అనేకులు పెద్దలకు చూపించాడు. మెచ్చుకున్న బహు కొద్దిమందిని వ్రేళ్ళమీద లెఖ్ఖపెట్టొచ్చు. మిగతా వేలాదిప్రబుద్ధులు పెదవి విరచారు.

రెండేళ్లుగా సాగిన ప్రచురణలు మళ్లు మొగంపట్టాయి. తొలుత గోచరించిన ఆశారేఖ దూరమౌతున్నట్లు తోచింది కిశోర్ కు. ఈ అనుభవం మాత్రం అతనిలో ఆత్మవిశ్వాసాన్ని సడలించలేదు; కాగా బలపరచింది. ఈ మధ్యను వొక్కసారీ జాహ్నవి జాడ తెలీలేదు. ఆమె అసలు వుందా? వుంటే అంతటి మేలుచేసిన తనను, ఆమెయొక్క ఏకైక ఆశాకిరణాన్ని మఱచిపోతుందా! ఏం—ఎందుకు మఱువగూడదు? స్వార్థంతో తాను తన ఆశయంకొఱకు ఆమెను వంచించినపుడు యింకా

తన్ను ఏ మొగం పెట్టుకుని జ్ఞాపకముంచుకోవాలని కోరుతున్నాడు? ఆమె భోగట్టా తీయాలని నిశ్చయించుకున్నాడు.

పట్నంలో అడుగు పెడుతూ ఎదురైన ప్రతిస్త్రీ ముఖాన్నీ మౌనంగా కళ్లతో ప్రశ్నిస్తున్నాడు జాహ్నవిజాడ చెప్పమని. మార్కెటు వీధిగుండా ఆనందబాబు యిలువుండే పేటకు బయలుదేరాడు. దారిలో ఒక దృశ్యం అతన్ని చకితపరచింది. బజారులో ఒకచోట పాతసామానులు విక్రయించేదుకాణం జాహ్నవిచే నిర్వహింపబడుతూంది. దూరాన్నుంచి చూస్తూ నిర్ఘాంతపోయాడు కిశోర్. పాతసీసాలూ, సైకిలుచక్రాలూ, ఇనుపమరలు, వాడి పారేసిన చిన్నచిన్న స్పేరుపార్టులు, వొకమూల — మఱొక వంక యుద్ధంనుంచి తిరిగివచ్చి ఇళ్లకుపోయే సైనికులమ్మివేసిన కోట్లూ, పాతరగ్గులూ, టోపీలూ, బూట్లూ — ఇంకొకప్రక్క పత్రికలకట్టలు, పాత పుస్తకాలు అనేకభాషలలోవి పదహారేళ్ల యువకుని చేత సర్దబడుతున్నాయి. అదిగో-ఆమెయే జాహ్నవి. కొంచెం పొడుగెదిగింది. బొద్దుగా వుంది. అవే కళ్లు. ఆవాళ రాత్రి ఆశాకాంతులతో మెఱసిన నయనాలు. త్రుటిలో పుస్తకాలవద్దకు వెళ్లాడు. వంగి షేక్స్పియర్ నాటకంతీసి "దీనివెల?" ముడిగా అడిగాడు. గొంతు పసికట్టడానికి వెదుకుతున్న కళ్లు గుత్తబడ్డాయి. "బాబూజీ - కిశోర్‌బాబూ!" మఱి మాట్లాడలేకపోయింది. క్షణంలో ఆమె వదనంలో అబలత్వం వెనుకై గంభీరత ఆవరించింది.

"దయచేయండి కిశోర్‌బాబూ — మీరు వెలిగించిన ఆశాజ్యోతి ఆరకుండా మీకై నిరీక్షిస్తూ వెలుగుతూంది. జీవితాన్నే చమురుగా దహించుకుంటూ" అని కుర్చీ చూపి "బాజీ—తర్వాత సద్దుదువుగాని వెంటనేవెళ్లి రెండుకప్పులతో టీన్నీ, బిస్కట్లూ తీసుకురా" అంది తమవైపు వెర్రిగాచూచే కుర్రవానితో. త్రుటిలో వాడు ప్రక్కకు వెళ్లాడు. "దారితప్పారా బాబూజీ! మీరు కథలో గానిలేరుగదా? లేక ఆఉద్యమం చాలించి హాయిగా బ్రతుకుతున్నారా? ఇన్నాళ్లకైనా తాము పెంచి పోషించిన లతను చూడ కోరిక జనింపజేసిన భగవంతునికి ధన్యవాదాలు". కిశోర్ ఇంతవరకు మెదల్పలేకపోయాడు పెదవుల్ని. మౌనంగా తెగ పరిశీలిస్తున్నాడు పరిసరాల్ని. "బాబో! దయఉంచి పరిశీలన తగ్గించండి కొంత. కొంపదీపి దీన్నిగూడా ఏకథలోనైనా ఇరికించేరా—ఇంక నాకు నిలుచోవడానికి తావుండదు" పరిహసించింది. ఆమె నవ్వు అతన్ని మాట్లాడించింది.

"ఇలాగున్నావేం జాహ్నవీ? ఈషాపు నీదేనా? ఎన్నాళ్లనుంచి నడుపుతున్నావూ?" "బాగాలేదూ ఈవ్యాపారం? మిమ్ము నాతో వుండనీయలేకపోయింది నాస్థితి. తర్వాత చదువు మానేశాను. మావయ్యొచ్చి ఏడాదిపాటు ఇంట్లోవుండి ఈ వృత్తిలో ప్రవేశపెట్టాడు. విధి ఇలాగుండడంగూడా సహించలేకపోయింది. ఆయనగూడా త్రాచుపాముగా పరిణమించాడు. నా వాతావరణం ఆయనకుగూడా స్వస్తి పలికింది. ఏదో అలాగాలాగు లేని ధైర్యం తెచ్చుకుని జీవితం వెళ్లబుచ్చుతున్నా. మీరింకా ఆలానే వున్నారా?" విచిత్రమైన వింతప్రశ్న ఆమెనుండి వెలువడింది.

"ఓ—ఆలానే వున్నా. ఇంకా రాళ్ళు విసురుతూనే వున్నాను. ఆశాజ్యోతి ఆరలేదు. అంతిమ విజయంకోసం అఱ్ఱులుచాస్తూ ఆకాశంలోకి యెగబ్రాకుతూంది." ఇంతలో టీ తెచ్చాడు బాజీ. "వీడి మేలు వెయ్యి జన్మాలకైనా మఱువలేను. కంటికి రెప్పలాగున కాపాడుతాడు. పేరుకు నాదిగాని ఈ షాపులో పనంతా వీడిదే". అంది జాహ్నవి. కిశోర్ బాబు సంగతంతా విన్నది "మీ రెక్కడున్నాసరే మీ విజయాన్ని కాంక్షించే జీవి ఒకటున్నదని మఱువకండి. మీరు జయిస్తారు. అదృష్టముంటే ఈ కన్నులతో ఈ జీవితంలో చూచే భాగ్యం నాకు కలగకపోదు. ఏనాటికైనా సమాజం మీకు కైమోడ్పు చేసి తీరుతుంది. ఇదిమాత్రం తథ్యం" అని ముగించింది జాహ్నవి. ఆమెను చూచేవరకూ ఏమేమో అనుకున్న కిశోర్‌కు ఇంక మాట్లాడ్డాని కేవీ కనుపడలేదు. లేచి శలవు తీసుకోబోతున్నాడు. "లోకంలో అంతా వొక్క తీరుగానే వుండరు. మోసగాళ్ళుంటారు జాగ్రత్త. ఎటువంటి వేళనైనాసరే మీరిక్కడకు యథేచ్ఛగా రావచ్చు. ఏమీ సంకోచించకండి. విజయోత్సాహంలో మునిగి ఈ దీనురాల్ని గనుక మఱచేరా—నాకిక దిక్కుండదు" ఆఖరిసారిగా ఆమె పలుకులు జాలిగా అతని చెవులలో గ్రుచ్చుకున్నాయి.

గిరుక్కున మళ్ళీన కిశోర్‌బాబుకు వొకసారి తన గదిని చూచిరావాలనిపించింది. తిన్నగా ఆనందబాబు యింటికెళ్లాడు. రెండేళ్లక్రితం ఎలాగుందో ఇప్పుడూ అలాగునేవుంది. తనను పరిహసిస్తున్నట్లు తన గదితాళం వూగిసలాడింది. విమలాదేవీ వాళ్లే ఇప్పుడూ అద్దెకున్నారు. తననుచూసి విస్తుపోతున్న ఆ గృహిణిని తలెత్తి పరికించాడు. ఆమెలోనూ ఏమీ మార్పులేదే. చూడగా తానే మారిపోయినట్టు

తోచింది. "బాబూజీ—రండి. కూర్చోండి. క్రొత్త వారికివలె అలా నిర్ఘాంతపోతారేం?" అంది విమలా దేవి. కుర్చీలో కూర్చున్నాడు. జాహ్నవిని గూర్చి ఆమె వ్యాపారాన్ని గురించీ అడగాలనిపించింది. ఆమెయే తనకు జాలిగొలిపేటట్లు చెప్ప నారంభించింది.

"నాయనా! ఏ నేరమూ లేనిదే తమ రలా అంతర్ధానమైనాక ఆపిల్ల ఎన్ని ఇక్కట్లు పడిందో దేవుని కెరుక" అంటూంటే ఆమెను ఆపి ప్రశ్నించాడు. "ఈపిల్ల నీ వృత్తిలోని కెవరు దింపారండీ?" "అదే చెబుతున్నా. కొన్నాళ్లు మీకోసం దుఃఖించి స్వగ్రామానికంటూ వెళ్లింది. నెలనాళ్లకు వీళ్ళ మేనమామట. ఒకాయన్ను దీసుకొచ్చింది. మూడు నెల్లదాకా మేపింది. ఆయనే తర్జనభర్జన చేసి తుదకు కొద్దిపాటి సొమ్ము అప్పుజేసి చిన్న దుకాణం పెట్టించాడు. ఆరు నెలలదాకా అలానే వుంది. కాని క్రమేపీ లాభం మొదలెట్టింది. బాజీ—అనే కుర్రాణ్ణి కుదుర్చుకున్నారు. వాడే ఈ చుట్టుపట్ల పదిమైళ్ళదాకా వున్న పల్లెటూళ్ళ కెళ్ళి పాతసామానులు, ఖాళీ సీసాలూ, చిత్తుకాగితాలూ చౌకగా కొంటూ వుంటాడు. అలాంటి విశ్వాసపాత్రుడగు పనివాణ్ణి ఎక్కడా చూడం. వాడు నౌఖరీలోకి వచ్చింతర్వాత జాహ్నవికి కొంచెం ఊపిరాడుతూంది. స్వయానా తమ్ముని కంటె మిన్నగా చూసుకుంటూంది వాణ్ణి."

అలాగకూడా ఆమె బ్రతకడం విధికి బరువైంది. రోజూ తనూ మామా తగవులాడుకునేవారు. ఆయనకు జాహ్నవి నిన్ను నిత్యమూ పూజిస్తూంటుందని ఎలాగో తెలిసింది. ఆమె మిమ్ము ప్రేమించడం ఆయనకు గిట్టలేదు. చాలాసార్లు మందలించాడు. కాని ఆమె మిమ్ము దైవంగా పరిగణించడం మానలేదు. చివరకొకనాడు తేల్చాడు. జాహ్నవిని తననే వివాహం చేసుకోమని. రెండో పెళ్లి అయినా తన కేంవీ వయసు ముదరలేదనీ, తన ఆస్తిపాస్తుల్ని ఆమెకే చెందజేస్తాననీ ఆమెను వేధించేవాడు. క్రమక్రమంగా బలవంతంలోకి దిగింది వ్యవహారం. ఒకనాడు జాహ్నవిపై చెయిచేసుకున్నాడు. ఇరువురకు పెనగులాట ప్రారంభమైంది. నే నెంత బ్రతిమాలినా ఆయన వినలేదు. చివరకు భగవంతుడు పంపాడా అన్నట్లు ఖాళీసీసాల కావిడితో బాజీ ప్రత్యక్షమయ్యాడు. వాడూ ఎంతో ప్రాధేయపడ్డాడు. లాభంలేకపోయింది. కుర్రవాడైనా కోపంతో ఉడికిపోయి కావడిలోంచితీసి ఖాళీ సీసాతో కణతమీద బలంకొద్దీ కొట్టాడు మామని. సీసా బళ్లున బ్రద్దలైపోయింది. జాహ్నవి కెవ్వున కేకబెట్టి నేలకూలింది ధారకట్టిన నెత్తుటిని చూడలేక. తలబ్రద్దలైంది ఆయనకు. సాయంత్రానికి ఆసుపత్రికి చేర్చారు. పోలీసులొచ్చి ఎంతో గొడవ చేశారు. జాహ్నవిని బాధించారు. ఆమెయే తనను హత్య చేయడానికి ప్రయత్నించిందని ఆయన వాఙ్మూల మిచ్చాడు. బాజీ—"నేను—నేరస్థుణ్ణి" అని ఒప్పుకున్నాడు. అతనికి సంకెళ్లు తగిలించి జైలుకు తీసుకెళ్ళారు. మళ్ళీ మూడు నెల్లదాకా లేవలేదు ఆ పెద్దమనిషి మంచంపై నుండి. రెండు నెలలు జైలులో కఠినశిక్ష ననుభవించి అక్కగారికోసం అటమటిస్తూ ఇంటికొచ్చాడు బాజీ. ఇలా మీకొఱకై యమయాతన లనుభవిస్తూ బ్రతుకు సాగిస్తూంది బరువుగా మాయ కూతురు."

ఈ ఉదంతం వింటూ కిశోర్ ఇక అక్కడ నిలువలేకపోయాడు. దీనవదనంతో ఆమెకు నమస్కరించి వీధినబడ్డాడు. ఎటూ నిశ్చయింపలేని హృదయంతో తూలిపోతున్నాడు. జాహ్నవి తనయెడ ఇంకా యింత బలీయమైన విశ్వాసం గలిగియుండడం అతన్ని ఉన్మత్తుని చేస్తూంది.

4

చికాకు మనస్సుతో కార్యాలయంలోకి అడుగు పెట్టాడు కిశోర్. లోన ఎవరో తీవ్రంగా వాగ్వివాదం జరుపుకుంటున్నారు. "ప్రెస్‌కు బేర మొచ్చింది. అమ్మించెయ్. వచ్చిన నష్టం చాలు" ఇది స్త్రీకంఠం. "నీయిష్టం. కొఱగానిపనికి డబ్బు అనవసరంగా ఖర్చుపెట్టడం నాకుమాత్రం నచ్చుతుందా. కానీ ఒకటే పీకుతూంది. ఆయన కింకా ఆపిచ్చి వదల్లేదు"—గోపాల్ బాబుది ఈ స్వరం. "వదలదు. మనం పచ్చిగా వున్నాళ్లు ఆయనపిచ్చి కుదరదు. చిత్తుకాగితాలతో సహా అమ్మెయ్. పది రోజుల్లో మనకు సొమ్ము చేరాలి. జాగ్రత్త". "అలాగే కానిద్దాం" "గోపాల్! అమ్మాయి పెళ్లిమాట ఆయనతో ఎప్పుడైనా ప్రస్తావించావా?" "లేదు. అలాగునే గోప్యంగా వుంచాను. ఇవాళనే తేల్చేస్తాను. పట్నంనుంచి రానీండి"

కిశోర్ లోనికి వెళ్ళాడు. వారిద్దరూ క్షణంసేపు చకితులైనారు. యజమానురాలు యింతటి అవ్యాజప్రేమ ఇన్నాళ్లుగా తనపై ప్రసరించడంలో గల అంతరార్థం బోధపడింది. ఆమెను ఏమనాలో తోచలేదు. నెమ్మదిగా ఆమె తప్పుకుంది. గోపాల్

ప్రారంభించాడు. "కిశోర్ - ఎంత చెప్పినా ఆమె వినడంలేదు. తానుబట్టిన కుందేటికి మూడేకాళ్లంటుంది". "ఆఖరిసారిగా ఒకేఒక ప్రయత్నం తలపెట్టాను. నేటివరకు విజయం ఎండమావులుగానే వుంది. నిన్న నే పత్రికలో ఒక ప్రకటన మాశాను. నవలా రచనల ప్రపంచపోటీలో పాల్గొంటున్నాను. దీనిలో విజయం వచ్చినాసరే. లేకుంటే ఇదంతా సొమ్ము జేసుకుందాం. శాశ్వతంగా నా ఉద్యమానికి తిలాంజలి యిస్తాను." "సరే" అన్నాడు గోపాల్. ప్రశాంతంగావున్న సమయంలో ప్రెస్ యజమానురాలికుమార్తె లీలాదేవి పెండ్లిగురించి ప్రస్తావించాడు. తనకిచ్చిన వాగ్దానాన్ని చెల్లించమని కోరాడు. కిశోర్ తన అసమ్మతిని వెల్లడించాడు. అయితే తన కడసారి యత్నం ఫలించేదాకా ఈ రహస్యం వెల్లడించవద్దని బ్రతిమాలాడాడు. గోపాల్ మౌనం వహించాడు. ఆ మౌనముద్రలో వొక మహావిప్లవం చెలరేగింది. కాలకూటవిషం ఆతని మెదడులో మెదిలింది అది ఏరూపంలో విజృంభించి తనకు మళ్ళీ ఎట్టి కీడును తెస్తుందో వూహించగలగడం బహుకష్టమయింది కిశోర్ బాబుకు. ఆ మౌన ప్రత్యుత్తరాన్ని ఆశ్చర్యంతోనూ, ఆ వేదనతోనూ స్వీకరించాడు.

కృషి మళ్ళీ ప్రారంభమయింది. రాత్రింబవళ్లు నిద్రాహారాలు త్యజించి వ్రాశా డొక నవలను. కళాకారుని కడసారి ప్రహారం—ఆతడు కేవలం విజయకాంక్షతో చైతన్యంతో పూనిక వహించాడు. తప్పక జయించి తీరాలనుకున్నాడు. నవలాపోటీకి పంపాడు ఆ గ్రంథాన్ని. రెండుప్రతులుగా తయారు చెయ్యబడింది. మిత్రుడు లీలాదేవికి చూపిస్తానని తీసుకుపోయా డొకప్రతిని. ఆతడు ఆ పుస్తకాన్ని చూసి మెచ్చుకున్నాడు; ఆమె నవ్వుకుందన్నాడు. ఆ మెప్పు, నవ్వు, పయోముఖవిషకుంభానివని తెలుసుకోలేకపోయాడు కిశోర్. తన జీవితభవిష్యత్తును తేల్చేది ఈ ప్రయత్నం. అదే అతని చావుబ్రదుకుల్ని నిర్ణయించాలి. అదొకటే ఆశతో దినాలు యుగాలుగా గడుపుతూ నిరీక్షిస్తున్నాడు. ఎన్నో తీయని కలలు గంటున్నాడు. ఆశాభావంతో తేలిపోతున్నాడు.

ఆతడు ఆశించిన గడువు దాటింది. ఎప్పటియట్లే నాడుగూడా కిశోర్ బాబు రచనలు తిరిగి వచ్చాయి. అయితే అవి వచ్చేసమయానికి లీలాదేవీ, గోపాల్ బాబూ అక్కడే వున్నారు. త్రిప్పివేయబడ్డ వాటిలో తాను పోటీకి పంపిన గ్రంథంగూడా వుంది. ఆతడు దాన్ని చూస్తూనే దిగులుపడిపోయాడు. ఏవిధమైన వ్యాఖ్యానం లేకుండానే పత్రికవాళ్లు తన నవలను తిరిగి పంపేశారు. ఒళ్లు తేలిపోయింది. జీవితంలో తానూహించని సంఘటన సంభవించింది. ఆ కవర్లు అలాగునే మూలకు గిరవాటేసి, కించిత్తూ తన అవస్థకు జాలిని ప్రకటించనివారివద్ద శెలవు పుచ్చుకుని పట్నం బయలుదేరాడు. ఆయన వెళ్లిన కొద్ది నిమిషాల అనంతరం ప్రెస్ నూ, ఇతర సామగ్రినీ అమ్మివేయమని మళ్లీ గోపాల్ బాబును హెచ్చరించి లీలాదేవి వెళ్లిపోయింది. ఇకనైనా కిశోర్ మనస్సు మార్చుకుని తన ఉన్మత్తతకు స్వస్తి చెప్పి ఆమెవద్దకు వచ్చి తీరుతాడని భ్రమించింది.

మతిలేని స్థితిలో రెండుమూడురోజులు కిశోర్ పట్నంలో తచ్చాడాడు. ఆ మైకంలోనే జాహ్నవిని చూడాలని బయలుదేరాడు. ప్రపంచంలో తానింక బ్రతకడం అనవసరం అనుకున్నాడు. ఆఖరిసారిగా జాహ్నవి ఎదుట నిలిచాడు. బాజీతో దుడుకుగా సంభాషిస్తోంది జాహ్నవి. "నిన్ననగా పోయావు తమ్ముడూ! ఈ రెణ్ణాళ్లలోనూ కనీసం పదూళ్లైనా తిరిగివుండాలి. ఏఁవీ ఖరీదు చెయ్యలేదూ?" "లేదక్కా. ఒక్క పాతసామానైనా దొరకలేదు. ఎపుడూ పత్రికల కట్టలు దొరికేవి. ఏవో చిత్తుకాగితాలూ, వ్రాతపుస్తకాలూ, పరీక్ష పేపర్లూ దిద్దిపారేసినవి—ఇంకా కవర్లలో మడిచివున్న కాగితాలు—అయితే సరుకుమాత్రం భారీగానే వుందిలే." "ఏవీ—ఎక్కడున్నాయీ?" "కావిడి మొయ్యలేక ఇంటిదగ్గిరే గదిలో బెట్టొచ్చాను. అక్కాయ్—చెప్పడం మరిచాను. ప్రొద్దుట కాఫీకి డబ్బులేకపోతే వూళ్లోకి రాగానే మసాలాపప్పూ, వేరుశెనక్కాయలూ అమ్ముకునేవాడికి పెద్దపుస్తకం వొకటి వాటిలోది అరటావు సైజుది అమ్మేశాను. ఎనిమిదణాలిచ్చాడు. నిన్నటినుండి మాడుతూన్న కడుపును దానితో తడిపాను." "సరేలే" అని ముఖం అటు త్రిప్పింది జాహ్నవి

ఎదుటివ్యక్తివాలకం గుర్తుపటడానికి ఆట్టే శ్రమపడనక్కరలేకపోయింది. కాని ఇదేం విపరీతం. కిశోర్ బాబు ఇలా వున్నారేం? "రండి—కూర్చోండి బాబూ." అతడు ఆమెమాటలు వినిపించుకునే స్థితిలో లేడు. "లేదు— జాహ్నవీ! కూర్చోడానికి రాలేదు. నా తుదిప్రయత్నం గూడా విఫలమైంది. ప్రపంచ పోటీకి నవల వొకటి పంపాను." అంటూంటే అడ్డుకుంది జాహ్నవి "మీరూ పంపారా? అయితే మీదే గెలుపు. జయించారు." "ఏం పిచ్చినమ్మకం నీది! పోయిన ప్రాణాలను గూడా లేవదీయ యత్నిస్తున్నావు విశ్వాసంతో.

నా విషయంలో ఆశలేదు. శెలవు. నిన్నొకసారి చూడ వేడుకబుట్టి వచ్చాను." "వద్దు, మీ రెక్కడికీ వెళ్లొద్దు. కొంత విశ్రాంతి తీసుకోవడం అవసరం." కిశోర్ ను బహు జాలిగా బ్రతిమాలింది. ఆమె ప్రార్థనను ఆయన వినడానికి రాలేదు. జీవితంలో తుదిసారిగా ఆమెను చూచిపోతానని తాను ఆమెకు మాటయిచ్చాడు. అంతే—ఆపని అయిపోయింది. రోజుకుంటూ ముందుకు సాగిపోయాడు. దృష్టిపథం నుంచి క్రమంగా దూరమైపోయాడు. ఆలోచనలో లీనమైన జాహ్నవికి తెలివివచ్చింది. బాజీని జాగ్రత్తిగా షాపు చూస్తూండమని ఆవైపు వెర్రిగా అతన్ని వెంబడించింది.

కిశోర్ బాబు సరాసరి బీచ్ వైపుకు వెళ్లాడు. దూరాన ఉప్పొంగిపోతున్న సముద్రం కెరటాలతో తన్నెదుర్కొనడానికి విజృంభించే లోకంవలె వుంది. ఎన్నో తలపులు లోన మెదిలినై. జీవితం చేదుగా వుంది ఆత్మహత్యకు నిశ్చయించుకున్నాడు. సిగరెట్టు ముట్టించుకోవడానికి ఆ ప్రక్కనే వున్న కిళ్ళీకొట్టువద్దకు వెళ్ళాడు. సిగరెట్టుతీసి కొట్టుతలుపుకు వ్రేలాడగట్టబడ్డ అగ్గిత్రాటిని పట్టుకుని తల వంచాడు. వంచిన తల ఎత్తకుండానే అలా వుంచేశాడు. పెదిమెలమధ్యనుండి సిగరెట్టు క్రిందకు జారిపోవడంగూడా గుర్తించలేదు. ఆ పరిస్థితి చూస్తూ కొట్టువాడుగూడా నిర్ఘాంతపోయాడు.

కొట్టుకు చేరగిలబడివున్న బల్లమీద అంటించబడివుంది వొక కాగితం. దానిలో నాటిదైనిక పత్రికా విశేషాలు, పెద్దపెద్ద అక్షరాలలో వున్నవి, అంటించబడివున్నాయి. అక్షరాలను చదువుతూ తూలిపోసాగాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. విచిత్రమైన అవస్థలో పూర్తిగా మునిగిపోయాడు. రెండు చేతులతోనూ ఆ బోర్డును పైకెత్తి ప్రారంభించాడు పరుగెత్తడం. కొట్టువాడు ఆడే మాటలుగూడా వినిపించుకోవడంలేదు. మార్గంలో జాహ్నవి ఎదురైంది. ఆమెనూ చూడలేదు.

జాహ్నవి అతని పాదాలపై వాలి "ఇదేవిటి కిశోర్ బాబూ! ఇలాగైపోయారు. నా ప్రార్థన మన్నించండి. ఇంటికి పోదాంరండి" అంటూ విలపిస్తూంది. ఆ బల్లను అక్కడే పారేశి అమాంతంగా ఆమెను కౌగలించుకున్నాడు. "జాహ్నవీ! నీవు చెప్పింది నిజం. నేనే తప్పను కున్నాను" అనసాగాడు—ఆమె కిది అర్థంకాలేదు. బల్లఎత్తి తనకూ ఆమెకూ మద్యగా పట్టుకున్నాడు. వణకే పెదిమలతో జారిపోతూన్న ఆనందబాష్పాలతో చదివింది "భారతీయ నవలాకారునికి ప్రపంచపోటీలో ప్రథమ బహుమానం. కిశోర్ బాబుకు అయిదువేల డాలర్ల కానుక—భారతీయ సాహిత్యంలో ఒక మహిమాన్వితఘట్టం-ఆమెగూడా తన కనులను తానే నమ్మలేకపోయింది. ఆనంద సాగరంలో తేలిపోతూ ఇల్లు చేరుకున్నారు. అప్పుడే బాజీ కావడిలో పెట్టుకున్న కాగితాలతో షాపుకు వెళ్లేడని చెప్పింది విమలాదేవి. పండువలతో రెండు రోజులు క్షణాలుగా దొర్లిపోయాయి.

5

కిశోర్ బాబు పత్రికాధిపతుల్ని కలుసుకున్నాడు. తన రచనను త్రిప్పివేయడంగూర్చి ప్రస్తావించాడు. ప్రతినిధులాతనిని మిక్కిలిగా సన్మానించారు. తాము రచనను అతనికి పంపనేలేదనీ, ఇందేదో ఇంద్రజాలం ఇమిడియున్నదనీ పేర్కొన్నారు. పౌరసన్మానాలుగూడా జరిగాయి. అతని రచనలన్నింటినీ సమగ్రంగా ముద్రించడానికి అంగీకరించి వాటిని తీసుకురమ్మని కోరారు. చాలా ధనం పారితోషికంగా ఇవ్వ నిశ్చయించారు. మఱునాడే విజయసూచకంగా ఒక రచనవ్రాసి తన ప్రాతపుస్తకాలకోసం పల్లెటూరికి బయలుదేరాడు. కాని అచ్చటి దృశ్యం అతణ్ణి కుందించింది. ప్రచురణాలయం ఎత్తివేయబడింది. పొరుగువారు చెప్పారు "గోపాల్ బాబూ, లీలాదేవీ—ప్రెస్సూ, తదితరసామగ్రీ అమ్మివేసుకుని మకాం ఎత్తివేశార"ని. ఎటుపోవడానికీ అతనికి కాళ్లాడలేదు. భోగట్టా జరిపి తిన్నగా గోపాల్ బాబువున్న చోటికి కెళ్లాడు. "అసలు ఆస్తి అంతా లీలాదేవిదే. ఆమెను నీవు వివాహం చేసుకోవని స్థిరపడింది. కాగా నీవు పిచ్చివాడవైపోయావనీ, నీకు పెట్టుబడి పెట్టడం వృధా అనుకునీ ప్రెస్ నీ తదితర సామగ్రినీ నాలుగు వేలకు అమ్మివేసింది." అన్నాడు బిక్కమొగం పెడుతూ గోపాల్ బాబు.

"నారక్తంతో వ్రాసినరచనలు, నా సరస్వతి - ఏదీ" దుఃఖంతో అంగలార్చాడు కిశోర్. "లోకం నీచంగాచూసి త్రోసిపారేసిన తుక్కు ఇంక వుండీ ఏంప్రయోజనం? కిశోర్! ఆ పాతకట్టలన్నీ అయిదు రూపాయల కమ్మివేశాం" అంటూన్న గోపాల్ చెయ్యిబట్టుకుని "ఎంతఘోరం జరిగిందీ! గోపాల్ - నీవాగ్దానం చెల్లించలేదని నాపై పగబట్టావా? ఎంతి అమానుషం? అయిదువేలకంటె విలువైనసాహిత్యాన్ని అయిదురూపాయల కమ్మివేశావా? ప్రాణపదంగా చిన్ననాటనుండీ పెంచుకున్న పుస్తకాలు

పరారీ అయ్యాయి. నేను గెలిచీ ప్రయోజనం లేక పోతూందే. ప్రపంచంలో ప్రథమబహుమతీ పొందానోయ్" అంటూన్న వెర్రికిశోర్‌ను చూచి గోపాల్ విస్తుపోయాడు. ఏమీ తెలియనట్లు నటించ ప్రయత్నించాడు! అంతా లీలాదేవియే చేసింద"న్నాడు మొగం వేలవైచి. ఇరువురూ బయలుదేరి లీలాదేవి వూరు చేరుకున్నారు. కిశోర్ విజయవార్తను పత్రికలలో చూచిన లీల ఆనందాన్ని పట్టలేక కౌగలించుకోవడానికి చేతులు చాచింది "లీలా — దూరంగా వుండు. నీవు స్త్రీవి కావు. రాక్షసివి. నిర్దయతో నా జీవితాన్ని నాశనం చేశావు. నా హృదయం, నా ప్రాణం అయిన సాహిత్యాన్ని ఎవరి కమ్మావు. నేను నీకేం అపకారం చేశానని మోసంచేసి నా రచన నాకు త్రిప్పివేయబడ్డట్లు చేశావు—నీ ఘోరం తెలుసుకోలేక, నీలో కాలకూటవిషం ఉడికి ఉబికిందని గ్రహించలేక నిజంగానే ఓడిపోయానని ఆత్మహత్యకు సిద్ధపడ్డాను. పవిత్ర జాహ్నవీ ప్రణయం నన్నాపింది లేకుంటే నీ పేరుమీదుగా అమరపురిలో కవిత్వం చెబుతూండేవాణ్ణి." అని తన్ను శూలాలవంటి మాటలతో పొడిచేస్తూ, వలవల దుఃఖిస్తున్న కిశోర్ బాబును చూచి వణకిపోయింది. "ఔను— కిశోర్. నీ ఘనతను గుర్తించలేక చిరంతనమైన సాహిత్యాన్ని చిత్తుకాగితాలుగా జమకట్టి రత్నాలను రాలకంటె తీసికట్టుగా లెక్కించి అమ్మిపారేసిన పాపిని నేనే—రచనారంగంలోంచి నిష్క్రమించి నావశ మౌతావని తుచ్ఛస్వార్థంతో నీవు నాకు పంపిన వ్రాతప్రతిని కవరులోవుంచి పట్నంనుండి పోస్టుచేయించిన ద్రోహిని నేనే. నా పాపానికి నిష్కృతిలేదు." అంది జాలిగా దుఃఖిస్తూ.

ఆ పాపపంకిల వాతావరణంలో మఱొక్క క్షణమైనా నిలువలేకపోయాడు. గిరుక్కున మఱునాడుదయానే పట్నం చేరుకున్నాడు. జరిగినదంతా జాహ్నవితో చెప్పి వలవల యేడ్చాడు. ఆవాళ మధ్యాహ్నం తాను మళ్లీ వ్రాసిన రచన తిరిగి వచ్చింది. పత్రికాధిపతులమీద పళ్లు కొరికాడు కిశోర్. తన నింకా నీచంగాయెంచి సమాజం అగౌరవపరుస్తుందన్నాడు. జాహ్నవి అతన్ని శాంతింపజేసి "కిశోర్ బాబూ? ఇప్పుడు పత్రిక నీరచన తిరస్కరించడంలో లోపంలేదు. బాధపడి ఏం ప్రయోజనం? నీవు యింక రచనా వ్యవసాయం ఆపుచెయ్. చెరుకు తుదన వెన్నుబుట్టింది. నీలో సంఘర్షణలేదు. పోరాటంలో విజయం సాధించిన నీవు నాటి సంగ్రామ సమయంలోవలె సజీవ రచన సాగించలేవు; ఎంత ప్రయత్నించినా గతంలోవలె వ్రాయలేవు. ఆ ఉద్వేగం, ఉద్రేకం నీవు ఎంత ఊహించినా రావు. నీకు తెలీకుండా మహోజ్వలమైన భవిష్యత్తు గతంలో కుదింపబడి ఇరుక్కుపోయింది." జాహ్నవి ముఖంవంక చూస్తూ సత్యమైన ఆమె సందేశాన్ని ఆలిస్తూ విస్తుపోతున్నాడు కిశోర్. పాతరచనలకై పలవించడం ప్రారంభించాడు.

పట్నమంతా గాలించమని తన్నుపంపే అక్కతో అంటున్నాడు బాజీ "అక్కా! బాబూజీ ఏవూళ్ళో వుండేవారు? ఆయన పుస్తకాలు ఎలాగున పోగొట్టుకున్నారు?" "అదంతా నీకెందుకూ? పోయి నే చెప్పినపని చెయ్" "కాదక్కా! మనంగూడా కొంటున్నాంగదా కాగితాలు. వాటిలోగానా ఉన్నాయేమో అని-" జాహ్నవి లోనికి వెళ్ళింది. ఛత్రపుర, కుటీర ప్రచురణలను గురించిచెప్పింది. "ఓ- అలాగైతే తప్పకుండా మనదగ్గరే వుండివుండాలి. ఆవాళ చెప్పలేదూ. ఏఁవీ సామానులు దొరకలేదు. పాతపుస్తకాలూ కవర్లూ మాత్రమే కొన్నానవి." చంగున బయలుదేరి షాపుకు వెళ్ళాడు. కిశోర్ బాబునుగూర్చి ఏమీ తెలియని బాజీకి ఇపుడు అసలు విషయం కొంత బోధపడింది.

అరగంటసేపటికి కావడి పట్టుకుని ప్రత్యక్షమయ్యాడు బాజీ పుస్తకాలతో. కట్టగట్టిన కవర్లూ, విడి వ్రాతప్రతులూ కిశోర్ బాబుముందు పడేశాడు. వొక్కసారి వాటిని కౌగలించుకుని "ఈ బహుమానం నాదిగాదు. నీదేరా బాజీ" అన్నాడు వాణ్ణి బుజ్జగిస్తూ. ఒక్కటొక్కటే తిరగేశి పరీక్షగా చూసుకున్నాడు. పుస్తకాలు అన్నీ ఉన్నట్లే వున్నయ్— కాని ఒకటిమాత్రం అవుపించలేదు. "ఇంతేనా— ఇంకా ఉన్నాయా?" ఆత్రుతతో ప్రశ్నించాడు. "లేవు" పెదవివిరచాడు బాజీ. జాగ్రత్తగా సర్దిపెట్టెలో బిగించేశాడు కిశోర్ వాటిని.

కిశోర్ ముఖంలో ఇంకా దిగులుపోలేదు. గుచ్చిగుచ్చి అడిగింది జాహ్నవి. "నిన్నుగురించి వొక పుస్తకం వ్రాశానూ అదిపోయింది అదీ నా దురదృష్టమే." అన్నాడు. జాహ్నవి బాజీని పిలచి అడిగింది. "ఆవేళ కాఫీకని ఓ పుస్తకం అమ్మేశాగా— బహుశః అదేనేమో అక్కా—" అన్నాడు బాజీ— ఇంక దాన్నిగూర్చి బాధపడి ప్రయోజనంలేదని ఊరడించింది. జాహ్నవి కాని ఆ కళాకారునికి తృప్తి లేదు—లీలాదేవిని తెగతిట్టడం ప్రారంభించాడు. ధనంకొఱకు తన సుఖంకోసం ఆమె సాహిత్యాన్ని హత్యచేసిందన్నాడు.

సముద్రతీరానికి వాహ్యాళికి బయలుదేరారు కిశోర్ జాహ్నవులు. సాయంకాలపు చల్లగాలిలో సాగరుడు కరాలనుచాచి ఆ ప్రేమజీవులను ఆహ్వానిస్తున్నట్లున్నాడు. ఇసుకతిన్నెమీద కూర్చున్నారు ఇరువురూ. పవిత్రజాహ్నవి సాగరుని యొడిలో ఔదల దాల్చినట్లు జాహ్నవి కిశోర్ ప్రాంగణంలో ముగ్ధగా పరవశరాలైయుంది. "జాహ్నవీ! నీ విశ్వాసం అచంచలమైంది. ఓటమిని నాకుగా వొప్పుకున్న నన్ను నీవే గెలిపించావు. ఇంతటి సంఘర్షణలో పాల్గొని మనస్సు నిలువద్రొక్కుకోలేకపోయాను. నైరాశ్యంపొందాను. కాని నీవో? మృత్యుముఖంలో గూడా ఆత్మవిశ్వాసాన్నే ప్రకటించావు." అంటూ బుజ్జగిస్తున్న కిశోర్‌తో "మీ ఆశాకిరణమే నా విశ్వాసానికి జీవం. జీవితంలో ఎన్నటికైనా మిమ్మ పొందగలననే దీక్ష నన్ను బ్రదికించింది." అంది. ఇంతలో వేరుశెనక్కాయలమ్మేవాడు బండి తోసుకుంటూ వస్తున్నాడు. కిశోర్ లేచి రెండణాలుపెట్టి కాయలుకొన్నాడు. పొట్లం విప్పుతూ రెండుకాయలు ఆమె కిచ్చాడు. అవి వొలిచి పొట్టును ఊదిపారేశి ఆతనికి గింజలందిస్తూంది. పరధ్యాన్నంలో పడి పొట్లం కాగితాన్ని తేరిపార జూశాడు కిశోర్. కిళ్ళీదుకాణంనుండి బల్లయెత్తుకుని తనవద్దకు పరుగెత్తుకువచ్చిన కిశోర్ ముఖం మళ్లీ అవుపించింది జాహ్నవికి. అంతే. త్రుటిలో వెర్రిగా పరుగెత్తాడు కిశోర్ వేరుశెనక్కాయలమ్మేవాని వైపు.

జాహ్నవి కేమీ బోధపడడంలేదు. "జాహ్నవీ—జాహ్నవీ—రా—రా నా ప్రాణం నేటికి కుదుటబడింది" అంటూన్న పిచ్చి కళాకారుని చూచి చుట్టుప్రక్కలవారు ఆశ్చర్యపడుతున్నారు. వేరుశెనక్కాయల వర్తకుడు వికటంగా నవ్వుతున్నాడు. వెనుకనే పరుగెత్తుకునివచ్చి "ఇదిగో—ఇక్కడే వున్నా" అంటూ కిశోర్‌ను గట్టిగా పట్టుకుంది. "లేదు. జాహ్నవీ—నీవు అంగడివాడికి అమ్ముడుపోయావు. నా నెత్తుటితో సృష్టించి నిన్ను యీ అన్యాయపు లోకంపాలు చేశాను. నా కారణంగా ఎన్ని ఇక్కట్లుపాలైనావో గదా? ప్రియమైన జాహ్నవీ! రావూ" అంటూ త్రోపుడు బండిలోని విడికాగితాల దొంతరను లాగేశాడు పైకి. జేబులోంచి రూపాయతీసి బిత్తరగా చూస్తున్న అంగడివాడి ముఖాన కొట్టాడు. పరుగున ఇంటికి చేరుకున్నాడు. చినిగిపోయిన కాగితాలను ఒక్కటొక్కటే చేర్చాడు. జాహ్నవి రోజుకుంటూ లోనికి అడుగుబెట్టింది. ఆమె కిప్పు డర్థమైంది. ఆతడు రాత్రింబవళ్లు విచారంతో వెదకుతూన్న గ్రంథం అది. తన పేరిట వ్రాయబడడం ఆమెలోని ఆందోళనను అధికం చేసింది.

పుస్తకంలో కొన్ని కాగితాలు శిథిలమైపోయాయి. కొన్నిటి నిండా నూనెమరకలు. కొన్ని లేనేలేవు. నాటినుండి మళ్లీ కూర్చున్నాడు దాన్ని పూర్తిచేయడానికి. సుమారు పాతిక పేజీలు పోయాయి. వారంరోజులు గడచినా పూర్తిగాలేదు. "పోనీలెండి. నా పుస్తకాన్నిగూర్చి మీకంత ధ్యాసెందుకూ" అంటుంది జాహ్నవి. "అలాగ్గాదు జాహ్నవీ! ఇది కేవలమూ పుస్తకమే ననుకున్నావా? నా సంఘర్షణలో తళతళలాడిన క్రొమ్మెరుపు. మఱపునకు రాని మహిమాన్విత ఘట్టం. నీవు మొన్న చెప్పినది నిజం. ఆ మెఱపును మళ్లీ నా హృదయాకాశంలో చూడలేను. నా గ్రంథం ఇలానే వుండిపోతుంది అసంపూర్తిగా." అని ఆమె ప్రక్కనే మేను వాల్చాడు. వాతావరణం బహు ప్రశాంతంగా వుంది. తుపాను పట్టి వెలసిన అనంతరపు మహాసాగరంవలె—కిశోర్ బాబుకు బాగుగా నిద్రపట్టింది. ఆతని ఉద్వేగాన్ని తిలకించిన జాహ్నవికి మాత్రం ఎంత ప్రయత్నించినా నిద్రరావడంలేదు—కళారాధన తక్క ఆయనకు జీవితంలో మఱొక విషయానికి తావులేదు. తన రచననుగురించి—కాదు—కాదు కళోపాసనలో రూపొందించుకున్న తననే గూర్చి తలంచుకు తలంచుకు కలవరిస్తున్నాడు నిద్రలోగూడా— "ఎంతపొరబాటు జరిగిందీ? నావల్ల సృష్టింపబడి, నా రక్తంతో పెంపబడి—అకారణంగా వొరులవల్ల పరులకు అమ్మివేయబడ్డావు—మఱతునన్నను మఱపునకు రావు—ఎలాగ ఈ జీవనఘట్టం—కళాఖండం పూర్తికావడం—అబ్బా. తలచినకొద్దీ సంఘర్షణ హృదయాన్ని జలదరింపజేస్తుంది — జాహ్నవీ! జాహ్నవీ!?"...